

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న జిల్లా జడ్జి

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో కడప జిల్లా కోర్టు న్యాయమూర్తి అన్నపూర్ణమ్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. -8లో



చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం

ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1060	రూ.1240
రెండోరకం	రూ.860	రూ.1050

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 726 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	370	456
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1148.38 కిలోలు

న్యూస్‌రీల్

జిల్లాకు పంటల బీమా మంజూరు

రాయచోటి : అన్నమయ్య జిల్లాకు డాక్టర్ వైఎస్‌ఆర్ ఉచిత పంటల బీమా మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రనాయక్ తెలిపారు. 2022 ఖరీఫ్ సీజన్‌కు రూ.98,943 కోట్లు మంజూరైందన్నారు. జిల్లాలో 48,780 మంది రైతులకు 63,731 ఎకరాలకు గాను 9 కోట్ల 89 లక్షల 43 వేల రూపాయలు మంజూరైనట్లు ఆయన వివరించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద వేరుశనగ, టమోటా పంటలకు పరిహారం మంజూరైందన్నారు. గ్రామాల వారీగా లబ్ధిదారుల వివరాలను మూడవ తేదీ వరకు ఆర్బీకేలలో ప్రదర్శించనున్నామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఆర్బీకేలలో నమోదు చేసుకోవాలని సూచించారు. త్వరలోనే ఈ పరిహారం మొత్తం రైతుల ఖాతాలలోకి జమ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి శనివారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

నేడు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులకు ఆదివారం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్టారెడ్డి తెలిపారు. సీనియారిటీ జాబితాను సంబంధిత జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

రూ. 5 కోట్లతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్



చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు : పీలేరులో రూ. 5 కోట్లతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ రాష్ట్ర అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలోని ఆయిల్ సీడ్స్ ప్రాంగణంలో ఇది వరకే చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 11 ప్రాంతాల్లో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి దక్షిణమూర్తి మాట్లాడుతూ రూ. 5 కోట్లతో నెలకొల్పుతున్న యూనిట్లకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. రూ. 1.50 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు యూనిట్ల ఏర్పాటుకు రుణసదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారి సుధీష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బోదేషావలి, ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

భవితకు బాసట

- పాఠశాలల్లో భవిత కేంద్రాల విలీనానికి ప్రభుత్వం కసరత్తు
- సాధారణ విద్యార్థులతో కలిపి విద్యాబోధన



మదనపల్లెలోని భవిత కేంద్రం

జిల్లాలోని భవిత కేంద్రాలు:	30
దివ్యాంగ చిన్నారులు :	545 మంది
విలీనం కానున్న భవిత కేంద్రాలు :	9

మదనపల్లె సిటీ: దివ్యాంగ చిన్నారులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇన్నాళ్లూ భవిత కేంద్రాల్లో వీరికి విద్యాబోధన చేసేవారు. ఇప్పుడు భవిత కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దివ్యాంగ చిన్నారులను సాధారణ విద్యార్థులతో కలిపి బోధించడానికి, వారిని శారీరకంగా, మానసికంగా బలవంతులు చేయడానికి కసరత్తు జరుగుతోంది. పాఠశాలల్లో భవిత కేంద్రాల విలీనం వల్ల దివ్యాంగ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, వసతి సమస్య తీరుతుంది. జిల్లాలో భవిత కేంద్రాలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. వీటిని సమీప పాఠశాలల్లో విలీనం చేయడానికి తరగతి గదులను కేటాయిస్తూ సంబంధిత అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఆయా పాఠశాలల్లో విలీనం చేయనున్నారు.

30 కేంద్రాలు...

జిల్లాలో 30 మండలాల్లో 30 భవిత కేంద్రాలున్నాయి. వీటిలో 545 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ చిన్నారులకు విద్యాబోధనతో పాటు వారికి అవసరమైన ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, హియరింగ్ థెరపీతో పాటు వివిధ రకాలైన చికిత్సలు అందిస్తున్నారు. అలాగే లైఫ్ స్కిల్స్, బిహేవియర్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఐఈడీ ఉపాధ్యాయులు నేర్పుతున్నారు. ఈ శిక్షణ కోసం ఐఈడీ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీని కోసం అవసరమైన పరికరాలు కూడా ప్రభుత్వం సమకూర్చుతుంది. వారంలో ఐదు రోజులు కేంద్రాలలో శిక్షణ అందించడమే కాకుండా ప్రతి శనివారం కేంద్రాలకు రాలేని చిన్నారులకు ఇళ్లకు వెళ్లి ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.

భోజన సమస్యలకు చెక్..

భవిత కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల వసతి, మధ్యాహ్నభోజన సమస్యలు తీరనున్నాయి. కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు సమీపంలోని పాఠశాలల నుంచి మధ్యాహ్న భోజనాన్ని ప్రస్తుతం తీసుకువస్తున్నారు. ఇక నుంచి సమీప పాఠశాలల్లో చేర్చడం వల్ల చిన్నారులకు కావాల్సినంత భోజనం ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం అందుతుంది.

విలీనంతో ప్రయోజనం..

భవిత కేంద్రాలకు వస్తున్న చిన్నారులను మరింతగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 9 మండలాల్లో ఉన్న భవిత కేంద్రాలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో దానికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తద్వారా ఆయా పాఠశాలల్లో చదువుతున్న సాధారణ విద్యార్థులతో వీరు కలిసిమెలిసి ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ విద్యార్థులతో కలిసి విద్యార్థులకు బోధన చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలా చేయడంతో శారీరకంగా, మానసికంగా వారు మరింత అభివృద్ధి చెందుతారన్నది అధికారుల అభిప్రాయం.

ఏర్పాట్లు చేశాం..



ప్రభుత్వం ఆదేశాల మేరకు భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఇక నుంచి సమీప స్కూల్స్‌లోనే చేపడుతాం. ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా ప్రతిపాదనలు పంపాం. దీని వల్ల వారిలో మానసిక స్థిరత్వం పెరుగుతుంది.

– జనార్ధన్, ఐఈడీ కోఆర్డినేటర్, అన్నమయ్య జిల్లా

ప్రత్యేక దృష్టి



దివ్యాంగులైన విద్యార్థుల మానసిక వికాసం కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. భవిత కేంద్రాలను సమీప పాఠశాలలకు అనుసంధానం చేస్తాం. దీంతో వారికి మరిన్ని సౌకర్యాలు కలుగుతాయి.

– శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

జగనన్న సురక్ష వినియోగించుకోవాలి

- సర్వీస్ ఛార్జి లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు జారీ
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



కలెక్టర్ గిరీషా పీఎస్, మునిసిపల్ ఛైర్మన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందుకుంటున్న లబ్ధిదారులు

రాయచోటి : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎటువంటి సర్వీస్ ఛార్జీ లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేస్తామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని మాసాపేట-1 శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ గిరీషా పీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా ఇవ్వడంతో పాటు మరే ఇతర అవసరమైన సర్టిఫికెట్లను కూడా త్వరితగతిన అందజేస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళుతోందన్నారు. జులై 1 నుంచి సచివాలయాలలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నామని.. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ తప్పక మేలు జరుగుతుందన్నారు. అనంతరం మునిసిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ గతంలో క్యాస్ట్ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులు తదితర పత్రాలు పొందాలంటే ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారన్నారు. నేడు సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రజల అవసరాలకు సంబంధించిన పనులన్నీ అప్పటికప్పుడే జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతుల మీదుగా వివిధ రకాల సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డీఈఓ పురుషోత్తం, జగనన్న సురక్ష మండల స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, మాసాపేట వార్డ్ కౌన్సిలర్లు పద్మావతమ్మ, ఈశ్వర్‌ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక బయోమెట్రిక్ వందశాతం పూర్తి చేయాలి

జిల్లాలో పంపిణీ పూర్తి చేసిన జగనన్న విద్యాకానుక బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ వారంలోపు వందశాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జగనన్న విద్యాకానుక, డ్రాపౌట్స్, 6, 8, 10వ తరగతుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంపు, పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనుల అంశాలపై విద్యాశాఖ ఎంఈఓలు, సమగ్ర శిక్ష అధికారులు, మండల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రగతిపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారని.. ఇందుకు సంబంధించి 1,54,789 మంది పిల్లల బయోమెట్రిక్ అథెంటిఫికేషన్‌ను వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని వాలంటీర్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని సూచించారు. పాఠశాలలో డ్రాపౌట్స్ జీరో శాతానికి తీసుకురావాలన్నారు. ఈ అంశంపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెడ్మాస్టర్లతో సోమ, మంగళవారాలలో సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు జారీ చేయాలని డీఈఓను ఆదేశించారు. పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులలో పది కాంపోనెంట్స్ పనులను జూలై 31లోగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఈఓ పురుషోత్తం, ఆర్‌ఐఓ కృష్ణయ్య, జిల్లా సమగ్ర శిక్ష సీఎంఓ కరుణాకర్, ఎంఈఓలు, మండల ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై సౌమ్యనాథుడు



నందలూరులో శనివారం సౌమ్యనాథుడు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనిమిచ్చారు. స్వామిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి హనుమంత వాహనంపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా అర్చకస్వాములు సునీల్, సాయి బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ పూజల్లో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇన్‌స్పెక్టరు దిలీప్‌రాజు, స్థానిక నేత అరిగెల నాని, డివిజన్ ఎస్సీసెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పెనుబాల నాగసుబయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకుడు నడివీధి సుధాకర్, వైఎస్సార్‌సీపీ దళితనేత కాకిచంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా స్వామి ఊరేగింపులో భక్తుల కోలాటం ఆకట్టుకుంది.

-నందలూరు (రాజంపేట)

శేషవాహనంపై శ్రీ సిద్దేశ్వరుడు



తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా శేషవాహనంపై శ్రీ సిద్దేశ్వర స్వామి భక్తులకు దర్శనిమిచ్చారు. శనివారం రాత్రి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మేళతాళాల మధ్య ఊరేగింపు కొనసాగింది. దారి పొడవునా భక్తులు కాయకర్పూరం సమర్పించుకున్నారు. అంతకుముందుగా స్వామివారికి అన్నమాచార్య ధ్యానమందిరంలో ఊంజల్‌సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీ చెన్నకేశవ స్వామి వాంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

-రాజంపేట

ప్రజారవాణాపై పట్టింపేదీ..?

- రైళ్ల హాల్టింగ్స్‌పై శీతకన్ను
- ప్రత్యామ్నాయంపై ఆలోచనేది
- హాల్టింగ్స్‌కు కరోనాతో బ్రేక్
- కనుమరుగవుతున్న పునరుద్ధరణ ఆశలు



హాల్టింగ్‌లేని జయంతి రైలు

రాజంపేట: దేశంలోనే రైల్వేశాఖ అతిపెద్ద ప్రజారవాణా వ్యవస్థ. సమయానుకూలమైన ప్రయాణం. తక్కువ చార్జీలు, మెరుగైన సౌకర్యాలు, రక్షణతో కూడిన ప్రయాణం. ఎలాంటి లాభాపేక్షలేకుండా సేవలందించడం రైల్వేసొంతం. ప్రయాణీకుల దృష్ట్యా కొన్నేళ్లుగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సైతం హాల్టింగ్స్ కల్పించాలని రైల్వే జీఎం, డీఆర్‌ఎంలకు రైల్వే ప్రజాసంబంధాల సభ్యులు విన్నవించారు. కాగా గూడ్ రవాణా మరింత వేగవంతంగా చేసేందుకు రైల్వే ట్రాక్స్ విస్తరిస్తుండగా ప్రజారవాణా కోసం కాదని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

- ముంబై-చెన్నై రైలుమార్గంలో అనేక ప్రధాన రైల్వేస్టేషన్లలో ఇప్పుడు పలు రైళ్ల హాల్టింగ్స్‌పై శీతకన్ను పెట్టింది రైల్వేశాఖ. రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు , పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట, కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైలుమార్గం కనెక్టివిటీ స్టేషన్ ఓబులవారిపల్లెతో పాటు రాష్ట్ర అధికారిక రామాలయం ఉన్న ఒంటిమిట్టతోపాటు జిల్లాలో మరికొన్ని రైల్వేస్టేషన్లలో రైళ్ల హాల్టింగ్ కల్పించడానికి రైల్వేబోర్డుకు చేతులు రాలేదు.

ఆక్యుపెన్సీ సాకుగా..

బీజేపీ పాలనలో రైల్వేలో ఇప్పుడు ఆక్యుపెన్సీ సాకుగా చూపి, అనేక రైల్వేస్టేషన్లలో రైళ్లను ఆపకుండా చేశారని బహిరంగంగానే విమర్శలు వెలువడుతున్నాయి. వందేభారత్‌కు ఇచ్చిన ప్రాధాన్యత ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లపట్ల చూపడంలేదని.. ఫలితంగా మధ్య, పేద తరగతి ప్రజానీకం రైలు ప్రయాణంకు దూరమవుతోంది. కొన్ని చోట్ల ఆక్యుపెన్సీ ఉన్న రైళ్ల హాల్టింగ్ విషయంలో టైమింగ్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో నిలపకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ విధంగా రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె స్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్ మరిచిపోయారు. రైల్వేపరంగా చరిత్ర కలిగిన, వందలాది ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఉన్న నందలూరులో కనీసం హిస్టారికల్‌గా తీసుకోకుండా రైళ్లన్నింటినీ పాస్‌త్రూ ఇచ్చేసేలా రైల్వేబోర్డు వ్యవహరించేలా డివిజన్, జోన్ అధికారులు చేస్తున్నారని రైల్వే కార్మిక కుటుంబాలు బహాటంగా విమర్శిస్తున్నాయి.

పునరుద్ధరణ ఏదీ..

ముఖ్యంగా వెంకటాద్రి, తిరుమల, చెన్నై, ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, రాయలసీమ, హరిప్రియ రైళ్ల హాల్టింగ్స్‌ను అస్తవ్యస్థంగా మార్చేశారు. హాల్టింగ్ ఇచ్చేది, కొన్ని నెలలు నడిపేది.. మళ్లీ ఎత్తివేసే పరిస్థితులు నేడు ఉన్నాయి. కరోనా రాక ముందు ఉన్న హాల్టింగ్స్ ఉభయజిల్లాలో కనుమరుగయ్యాయి. ప్రయాణీకులు వెళ్లేందుకు సరైన సమయంలో, సరైన రీతిలో రైళ్లు అందుబాటులో లేవు.

రాజంపేటలో...

ఉభయ జిల్లాలో కడపతో పాటు రాజంపేట రైల్వేస్టేషన్ పార్లమెంటరీ కేంద్రంలో ఉంది. అయితే కడపతో పోల్చుకుంటే రాజంపేటలో హాల్టింగ్స్ లేని రైళ్లు అనేకం ఉన్నాయి. ఏపీ సంపర్క్ క్రాంతి, హరిప్రియ, జయంతి, మధురై, నాగర్‌కోయిల్ రైళ్లు ఆగవు. ఇవన్నీ కూడా ఇతర రాష్ట్రాల ప్రయాణానికి వెళ్లే రైళ్లు. వీటి హాల్టింగ్స్ కలగానే మిగిలిపోయింది. ఎంపీ మిథున్‌రెడ్డి ఇప్పటికే అనేక మార్లు రైల్వేమంత్రిని కలిసి ఈ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరిన సంగతి విధితమే.

కరోనాతో ..

కరోనా మహమ్మారి రైలు ప్రయాణాలకు బ్రేక్ వేసింది. కరోనా వ్యాప్తి రాకముందు నడుస్తున్న రైళ్ల హాల్టింగ్స్‌కు ఫస్ట్ కరోనా నుంచి నిలిపివేసింది. ఆ తర్వాత రైళ్లను దశలవారీగా పట్టాలు ఎక్కించినప్పటికీ వాటి చార్జీలు పెంచడం, కొన్ని హాల్టింగ్స్‌ను ఎత్తివేయడం లాంటివి చేపట్టారు.

ప్రజా రవాణాకే తూట్లు పొడుస్తున్న రైల్వేశాఖ..



ప్రజా రవాణాకే తూట్లు పొడిచే విధంగా రైల్వేశాఖ అడుగులు వేస్తోంది. రాజంపేట పార్లమెంటు పరిధిలోకి వచ్చే నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె , రైల్వేకోడూరులో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ మార్గంలో నడిచే అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించారు. కరోనా ముందు ఏవిధంగా రైళ్లకు హాల్టింగ్ ఉందో అదే విధంగా మళ్లీ పునరుద్ధరణ చేయాలి.

– కెఎంఎల్ నరసింహులు, జాతీయ కన్వీనర్, ఫోరంఫర్ సోషల్ జస్టిస్, రాజంపేట

ప్రజావసరాలను గుర్తించని రైల్వేశాఖ



ఒకప్పుడు రైల్వే దేశంలోనే అతి పెద్ద రవాణా వ్యవస్థ. ప్రజా అవసరాలకు అనుగుణంగా హాల్టింగ్స్, రైళ్లు నడిపించేవారు. ప్రధాని మోదీ పాలనలో రైల్వేబడ్జెట్ లేకుండా చేశారు. ప్రజావసరాలను గుర్తించకుండా కేవలం ఆదాయం, ప్రైవేటీకరణ దిశగా రైళ్ల హాల్టింగ్, రాకపోకలు నిర్ణయాలు సాగుతున్నాయి. ఇలాంటి నిర్ణయాలతో ప్రజలకే ఇబ్బందులు.

– జంబు సూర్యనారాయణ, నాగిరెడ్డిపల్లె సర్పంచి, నందలూరు



క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

మదనపల్లె : తల్లితో గొడవపడి మనస్తాపంతో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఎస్టేట్ శివాజీనగర్‌లో తల్లి సరస్వతమ్మతో కలిసి యువకుడు నరసింహులు(23) నివాసం ఉంటున్నాడు. భవననిర్మాణ కార్మికుడిగా పనిచేయడంతో పాటు స్థానికంగా చిన్న చిన్న గుడుల్లో పూజారిగా వ్యవహరిస్తున్నాడు. శుక్రవారం తల్లి సరస్వతమ్మతో గొడవపడి ఆమెను కొట్టాడు. దీంతో ఆమె టూటౌన్ పోలీసులకు కుమారుడిపై ఫిర్యాదు చేసింది. అదేరోజు రాత్రి ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయిన నరసింహులు శనివారం పట్టణంలోని రంగారెడ్డికాలనీ వద్ద అల్లనేరేడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓ యువకుడు చెట్టుకు వేలాడుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా ఎస్ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలను సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని ఉప సర్పంచ్‌కు గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని కడప–బద్వేలు ప్రధాన రహదారిపై కారు ఢీకొన్న సంఘటనలో కొండూరు ఉప సర్పంచ్ బోవిళ్ల రామకృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో రామకృష్ణారెడ్డి బద్వేలు వెళ్లేందుకు బస్సుకోసం పోలీస్ స్టేషన్ సమీపంలో నిలుచుని ఉన్నాడు. బద్వేలు వైపు నుంచి వేగంగా వస్తున్న ఏపీ 27బీఎస్8282 నెంబరు గల కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో కారు డ్రైవర్ కారును ఆపినట్లే ఆపి ఉడాయించాడు.

ఆభరణా జ్యువెలరీస్ నిర్వాహకులపై కేసు



మదనపల్లె ఆభరణా జ్యువెలరీస్‌లో డబ్బులు చెల్లించి మోసపోయిన బాధితులు

మదనపల్లె : అక్రమ పద్ధతిలో కస్టమర్ల నుంచి డబ్బులు వసూలుచేసి మోసం చేసిన ఆభరణా జ్యువెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పట్టణంలోని సీటీఎం రోడ్డు చంద్రమోహన్ నర్సింగ్ హోమ్ ఎదురుగా గత ఏడాది గుంటూరుకు చెందిన ధూపాటి సుధాకర్ ఆభరణా జ్యువెలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో గోల్డ్‌లోన్ స్కీం ప్రారంభించారన్నారు. గోల్డ్‌స్కీమ్‌లో 11 నెలలు డబ్బులు కడితే 12వ నెలలో బోనస్‌గా నగదు లేదా బంగారం ఇస్తామని నమ్మించి డబ్బులు కట్టించుకున్నారన్నారు. దీంతో పట్టణంలో అధికసంఖ్యలో మహిళలు గోల్డ్‌స్కీమ్‌కు ఆకర్షితులై పెట్టుబడిగా పెట్టారన్నారు. గడువు తీరినా జ్యువెలరీస్ కంపెనీ వారు చెప్పిన ప్రకారం డబ్బులు కానీ నగలు కానీ ఇవ్వకపోవడం, ఫోన్ చేసినా పట్టించుకోకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన నటరాజశేఖర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఆభరణా జ్యువెలరీస్ ఎండీ ధూపాటి సుధాకర్, ఇన్‌చార్జ్ దివ్య, అకౌంటెంట్ డేనియల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేంద్ర, సేల్స్ డైరెక్టర్ హేరీవిన్సెంట్, ఎండీ పీపీ లతపై కేసు నమోదుచేశామన్నారు. వీరందరూ గోల్డ్‌లోన్ స్కీమ్ పేరుతో పట్టణంలో కస్టమర్ల నుంచి సుమారు రూ.40లక్షల వరకు కట్టించుకున్నారని తెలిపారు. దీంతో ఎండీ ధూపాటి సుధాకర్‌తో పాటు మిగిలిన ఆరు మందిపై క్రైమ్‌నెంబర్.117/2023 కింద 406, 409,420 రెడ్ వీత్ 34 ఐపీసీ, సెక్షన్ 5 ఆఫ్ ఏపీ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ అండ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిస్‌మెంట్ యాక్ట్–1999, సెక్షన్ 4.5 ప్రైజ్ అండ్ చిట్స్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్(బ్యానింగ్ యాక్ట్ 1978) కింద కేసు నమోదుచేశామన్నారు. ఏవైనా గోల్డ్‌స్కీమ్‌లలో కానీ, లైసెన్స్‌లేని చిట్‌ఫండ్ కంపెనీల్లో డబ్బులు కట్టే ముందు జాగ్రత్త వహించాలన్నారు. ఇలాంటి సంస్థలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల నుంచి అక్రమ మార్గాల్లో డబ్బులు వసూలుచేసి మోసగించే సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. సీటీఎం రోడ్డులోని ఆభరణా జ్యువెలరీస్ సంస్థకు సీల్ వేసి స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఐఎఫ్‌ఎస్‌లో మెరిసిన మనోడు

ఆలిండియా 31వ ర్యాంకు సాధించిన భువనేశ్వర్



భువనేశ్వర్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు

మదనపల్లె సిటీ/ పెద్దమండ్యం: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఇండియన్ ఫారెస్టు సర్వీసు పరీక్ష–2022లో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలం రెడ్డివారిపల్లెకు చెందిన నారా భువనేశ్వర్ జాతీయ స్థాయిలో 31వ ర్యాంకు సాధించాడు. శనివారం భారత ప్రభుత్వ ఐఎఫ్ఎస్–2022 కు సంబంధించి విడుదల చేసిన తుది ఫలితాల్లో భువనేశ్వర్ సత్తా చాటాడు. భువనేశ్వర్ తండ్రి ఎస్.వెంకటసుబ్బయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేశారు. తల్లి మునివీరమ్మ తంబళ్లపల్లె జెడ్పీహైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. భువనేశ్వర్ మదనపల్లె జ్ఞానోదయ పాఠశాలలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. తర్వాత కేరళలోని తిరువనంతపురంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. ఆన్‌లైన్‌లో ఐఎఫ్ఎస్‌కు కోచింగ్ తీసుకుంటూ రెండో ప్రయత్నంలో విజయం సాధించినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ షన్మోహన్ తనకు వరుసకు సోదరుడు అవుతారని, ఆయన స్ఫూర్తితో తాను ఐఎఫ్ఎస్‌కు ప్రిపేర్ అయ్యానన్నారు. ప్రకృతికి దగ్గరగా గడపడం, వాతావరణ పరిస్థితులు, స్థితిగతులను అధ్యయనం చేయడం చిన్నప్పటి నుంచీ ఇష్టం కావడంతో ఐఎఫ్ఎస్ కావాలని కష్టపడి చదివినట్లు చెప్పారు. శనివారం మదనపల్లెలో కుటుంబ సభ్యులు భువనేశ్వర్‌ను అభినందించి స్వీట్లు పంచిపెట్టారు. నారా భువనేశ్వర్ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించడంపై అన్నమయ్య జిల్లా గాండ్ల, తెలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటరమణ అభినందనలు తెలిపారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న జిల్లా జడ్జి



రామయ్య సన్నిధిలో కుటుంబ సమేతంగా ఉన్న జిల్లా న్యాయమూర్తి అన్నపూర్ణమ్మ

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన మూల మూర్తులను శనివారం కడప జిల్లా కోర్టు న్యాయమూర్తి అన్నపూర్ణమ్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూల మూర్తులైన సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో వారు కాసేపు సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, సిద్దవటం కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్, టీటీడీ సిబ్బంది, కోర్టు సిబ్బంది ఉన్నారు.

సౌమ్యనాథుడిని దర్శించుకున్న జిల్లా జడ్జి

నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథస్వామిని శనివారం జిల్లా జడ్జి అన్నపూర్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఈమె వెంట నందలూరు జడ్జి లత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి నరసింహులు, ఏజీపీ షమీవుల్లాఖాన్, న్యాయవాది హస్తవరం ఆనంద్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాబోధనపై అవగాహన లేకపోతే ఎలా?

ఉపాధ్యాయుల తీరుపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మండిపాటు



పోరుమామిళ్ల : టేకూరుపేటలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

పోరుమామిళ్ల : విద్యార్థులకు ఎలా విద్యాబోధన చేయాలన్న దానిపై ఉపాధ్యాయులకు ఇప్పటికీ అవగాహన లేకపోతే ఎలా? విద్యార్థులను నిలబెట్టి చదువు చెబుతారా? బ్లాక్ బోర్డు బదులు రైటింగ్ ప్యాడ్ అట్టను ఎలా ఉపయోగిస్తారని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ పరిస్థితులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరావు పనితీరు కారణంగా ఆయన జిల్లా విద్యాశాఖ అధికారులకు తలంటారు. వ్యవస్థలో మార్పు రాదా? ఇంత అలసత్వమా? అంటూ మండి పడ్డారు. డిజిటల్ బోర్డులను ఉపయోగించుకొని పిల్లలకు చక్కగా పాఠాలు చెప్పాలన్నారు. పిల్లలకు యూనిఫామ్ లేకపోవడంపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నాడు–నేడు పనుల్లో జాప్యంపై ఆయన సచివాలయ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరిశీలన..

అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు–నేడు పనులు, వాటర్ ప్లాంట్ పరిశీలించారు. శుద్ధి నీటిని పరీక్షించి ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందని, ఈ నీళ్లు తాగితే పిల్లలకు రోగాలు వస్తాయని, ముందు ప్లాంట్ బాగు చేయాలన్నారు. నాడు–నేడు పనుల గురించి ప్రిన్సిపాల్ జయసుబ్బారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు. అక్కడ కూడా హెడ్మాస్టర్ రత్నస్వామి పనితీరుపై మండిపడ్డారు. లోపాలు సరిదిద్దుకోక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆయన వెంట పాఠశాలల ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి, కళాశాలల ఆర్జేడీ రవి, డీఈఓ రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి, ఆర్ఐఓ రమణ రాజు, ఆర్‌డీఓ ఆకుల వెంకటరమణ, తహసీల్దారు గంగయ్య, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు–నేడు నిధులను సద్వినియోగం చేసుకోండి

కలసపాడు : ప్రభుత్వం పాఠశాలలకు నాడు–నేడు కింద మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన కలసపాడులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని తరగతి గదులను, నాడు–నేడు ఫేజ్–2 కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన తీరు గురించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి ఆ విద్యార్థితో ఇంగ్లీషులో మాట్లాడగా విద్యార్థిని చక్కగా మాట్లాడటంతో తరగతి ఉపాధ్యాయురాలైన రబ్బానితో ఫోన్‌లో మాట్లాడి ఆమెను అభినందించారు. ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి

కాశినాయన : విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సకాలంలో వారికి అందించి విద్యాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక అందిందా అని ఆరా తీశారు. పుస్తకాలు, బ్యాగులు పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవడం మీకు తెలియదా అని హెచ్ఎంను మందలించారు. ఎంఈఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన రమేష్‌నాయక్

మదనపల్లె : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మదనపల్లె మండలంలో శనివారం రాత్రి జరిగింది. వేంపల్లె పంచాయతీ కొండమీద చెరువు తండాకు చెందిన బి.రమేష్‌నాయక్ గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పెట్రోల్ బంకుల్లో

విజిలెన్స్ అధికారుల తనిఖీ



తేజ పెట్రోల్ బంక్‌లో డీజిల్, పెట్రోల్ తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కడప అర్బన్ : కడపలో రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ పి. రామకృష్ణ, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ. బాలగంగాధర్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్లు కె.వి కిషోర్, వి. అశోక్ కుమార్, జిల్లా సివిల్ సప్లెస్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ఆఫీసర్ తారకనాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ సిబ్బందితో కలిసి కడప నగరంలోని తేజ ఫిల్లింగ్ సెంటర్, వాసవి ఫిల్లింగ్ స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

■ ఈ తనిఖీలలో పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ డెన్సిటీని, క్వాలిటీ అండ్ క్వాంటిటీలను డిస్పెన్సింగ్ యూనిట్లను వాటికి సంబంధించిన పెట్రోల్ బంకుల్లో ఇస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.

■ ఈ తనిఖీలలో భాగంగా ఎక్స్‌ప్లోసివ్ మెటీరియల్ క్యారీ చేయడానికి అవసరమైన అనుమతి పత్రాలు సరిగా లేనందున వాసవి ఫిల్లింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఏపీ 04 యుఏ 1623 డీజిల్, పెట్రోల్ రవాణా చేసే ట్యాంకర్‌ను సీజ్ చేశారు. ట్యాంకర్ యజమాని పాలాది ఉమామహేష్, బాలాజీ భరత్‌కుమార్ పైన సెక్షన్ 6(ఏ) ఈఎస్ యాక్ట్ 1955 చట్టం మేరకు కేసు నమోదు చేశారు.

■ ఈ సందర్భంగా కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా మాట్లాడుతూ పెట్రోల్ బంకు యజమానులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నుంచి తగిన లైసెన్సులు కచ్చితంగా పొంది ఉండాలన్నారు. అలాగే నాణ్యమైన, స్వచ్ఛమైన కల్తీలేని పెట్రోల్, డీజిల్‌లను వాహనదారులకు అందించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు బంకులు నిర్వహించుకోనట్లయితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం వలసపల్లె రోడ్డులోని షాదీఖానా సమీపంలో నివాసం ఉండే ఇల్లూరు దహనాథ్‌రెడ్డి (56) అనే వ్యక్తి అప్పులకు పూచీకత్తు పడి వాటిని కట్టించలేక శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రగుంట్ల ఎస్ఐ క్రిష్ణంరాజు నాయక్ కథనం మేరకు.. దహనాథ్‌రెడ్డి స్థానిక ఐసీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేసేవాడు. తోటి కార్మికులకు అప్పులు ఇప్పించి పూచీకత్తు పడ్డాడు. అయితే అప్పులు తీసుకున్న వారు తిరిగి చెల్లించకపోవడం.. అడిగితే వారు పలకకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. దీంతో మనస్థాపానికి గురై వలసపల్లె రోడ్డులోని ఈద్గా వద్ద ఉన్న పాడుబడ్డ గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కూడా గతంలో కరోనాతో మృతి చెందింది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చిత్తూరు, నెల్లూరు జట్ల విజయం



6 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ ముఖేష్



5 వికెట్లు తీసిన అనంత బౌలర్ తన్వీర్



54 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మన్ సుతేజ్‌రెడ్డి



42 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ విజయ్ రామ్‌రెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం నిర్వహించిన మ్యాచ్‌ల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 41.2 ఓవర్లలో 155 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భవానీప్రసాద్ 37, రెడ్డిరుషీల్ 37 పరుగులు చేశారు. అనంత బౌలర్లు తన్వీర్ జమీల్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 28.1 ఓవర్లలోనే 87 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని వీరారెడ్డి 25 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ ముఖేష్ 6 వికెట్లు తీశాడు. దీంతో చిత్తూరు జట్టు 68 పరుగుల తేడాతో విజయం సాధించింది.

నెల్లూరు జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 30.2 ఓవర్లలో 120 పరుగుల వద్ద కడప జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని సి. విజయ్ రామ్‌రెడ్డి 66 బంతుల్లో 5 ఫోర్లతో 42 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సుజిత్‌రెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో నెల్లూరు జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

రూ.760కోట్ల అభివృద్ధి పనులకు సీఎంతో శంకుస్థాపన

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7,8 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తెలిపారు. ఈ క్రమంలో కడప నగరపాలక సంస్థలో రూ.760కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నగరపాలక అత్యవసర సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రూ.572కోట్లతో అమృత్ పథకం కింద కడప నగరానికి బ్రహ్మం సాగర్ నుంచి 1.50 టీఎంసీల తాగునీరు అందించే పథకానికి శంకుస్థాపన చేయనున్నారన్నారు. రూ.20కోట్లతో బుగ్గవంకపై రెండు నూతన బ్రిడ్జిల నిర్మాణానికి, పాత మున్సిపాలిటీ వద్ద రూ.32కోట్లతో నిర్మించనున్న నూతన నగరపాలక సంస్థ కార్యాలయానికి భూమిపూజ చేయనున్నారని తెలిపారు. రూ.69కోట్లతో జగనన్న కాలనీలు, వైఎస్సార్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. రూ.12కోట్లతో ఆధునీకరణ చేసిన రాజీవ్ మార్గ్, రాజీవ్ పార్కులను ప్రారంభించనున్నారన్నారు. రిమ్స్ ప్రాంగణంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రసాద్ ఐ హాస్పిటల్, మానసిక వైద్యశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. డిసెంబర్‌లో ఈ భవనాలను ప్రారంభిస్తామని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేస్తామని, మూడు రోడ్లను డిసెంబర్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.

నడిరోడ్డుపై కత్తులతో యువకుల ఘర్షణ





సంఘటన స్థలంలో నిందితులను అదుపులోకి తీసుకుంటున్న కడప ఒన్‌టౌన్ పోలీసులు

- ముగ్గురికి తీవ్రగాయాలు
- పోలీసుల అదుపులో నిందితులు

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాలెంపాపయ్య వీధిలో శనివారం రాత్రి కొందరు యువకులు కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పాతకక్షలో.. మద్యం మత్తులోనో వీరు తీవ్ర స్థాయిలో ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటన జరిగిన వెంటనే కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ జి. మధుసూదన్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన అక్కడికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని రిమ్స్‌కు తరలించారు. కడప ఒన్‌టౌన్ పోలీసులతో పాటు, రక్షక్, బ్లూకోల్ట్స్ పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆ ప్రాంతంలో గస్తీ తిరిగారు.

భూ వివాదంలో పూజారిపై దాడి

గాలివీడు: మండలంలోని గోపనపల్లె గ్రామం బండమీద నక్కలవాండ్లపల్లె సమీపంలోని నాగదేవత ఆలయం వద్ద పూజారి కృష్ణారెడ్డిపై ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. నక్కలవాండ్లపల్లె సమీపంలో పురాతనమైన నాగదేవత ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని దాదాపు 20 సంవత్సరాల క్రితం పూజారి కృష్ణారెడ్డి తన సొంత నిధులతో గోపనపల్లె సర్వే నెంబరు 194/1ఏలో య0.34 సెంట్ల విస్తీర్ణంలో నిర్మించారు. రోజూ పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యర్థి అయిన ఎమ్. పెద్ద ఇరగంరెడ్డి, కుటుంబ సభ్యులు పూజారి కృష్ణారెడ్డిపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. వెంటనే బాధితుడు సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని మండల పోలీసులు తెలిపారు.